క్లుప్తంగా

చెత్తా చెదారం తొలగించండి


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న డివైడర్ల నడుమ పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. ఆదివారం ఉదయం పట్టణంలోని కసాపురం రోడ్డులో శానిటేషన్ పనులను పరిశీలించారు. రోడ్డు డివైడర్ల నడుమ ఉన్న చెత్తాచెదారాన్ని తీసివేయించారు. డివైడర్ల నడుమ ఉన్న చెట్లకు రోజూ నీరు పోయాలని సూచించారు.

వాహనాల తనిఖీ

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని అనంతపురం–తాడిపత్రి రహదారిపై ఆదివారం సాయంత్రం బీకేఎస్ పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ కరుణాకర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా రికార్డులు దగ్గర ఉంచుకోవాలన్నారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదన్నారు. అనంతరం రికార్డులు సరిగాలేని పలువురు వాహనదారులకు జరిమానాలు విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీల తొలగింపుపై మాలధారుల ఆగ్రహం



మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మాలధారులు

గుంతకల్లుటౌన్: పట్టణంలో ఫ్లెక్సీలు తొలగించడాన్ని నిరసిస్తూ అయ్యప్పస్వామి, భవాని, హనుమాన్ మాలధారులు ఆందోళన చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్, టీపీఓ సత్తార్ వైఖరికి వ్యతిరేకంగా ఆదివారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మాలధారులు వెంకటేష్, మహేష్, పురుషోత్తమ్‌లు మాట్లాడుతూ పట్టణంలో రాజకీయ నాయకులు విచ్చలవిడిగా వేయించిన ఫ్లెక్సీలను తొలగించడం చేతకాని అధికారులు.. మాలధారుల దీక్షలకు సంబంధించి వివిధ ఆలయ కమిటీల తరఫున వేసిన ఫ్లెక్సీలను తొలగించడం ఎంతమేరకు సమంజసమని ప్రశ్నించారు. పోలీసులు జోక్యం చేసుకుని మున్సిపల్ అధికారులతో చర్చించి తొలగించిన ఫ్లెక్సీలను తిరిగి వేయిస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

నేడు 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఓబిలేసు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రజలు ఫిర్యాదు చేసే పత్రంలో ఆధార్, సెల్ నంబర్లను తప్పకుండా నమోదు చేయాలని ఆయన సూచించారు.

అసిస్టెంట్ పోస్ట్‌మాస్టర్ సేవలు అమోఘం


అన్వర్ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలోని కోట వీధిలో ఉన్న హెడ్ పోస్టాఫీసులో అసిస్టెంట్ పోస్టమాస్టర్ అన్వర్ ఆదివారం పదవీ విరమణ సందర్భంగా పోస్టాఫీసులో ఘనంగా సన్మానించాచారు. పోస్టమాస్టర్లు, సిబ్బంది, ఉపాధ్యాయులు, న్యాయవాదులు, సామాజిక కార్యకర్తలు అన్వర్‌ను శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పోస్టల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్యయాదవ్, అధ్యాపకులు శ్రీకరం గోవిందరాజులు, మస్తానప్ప, ఉపాధ్యాయుడు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు జయప్రదం చేయండి

పామిడి: స్థానిక అంబేడ్కర్ కాలనీలోని ఆర్డీటీ స్కూల్‌లో ఈ నెల 18న సాయంత్రం నిర్వహించే సెమీ క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలని కాలనీవాసులు ఆదివారం కోరారు. స్థానిక బందెల వారి ఆధ్వర్యంలో కసుంపల్లి పాస్టర్ రెవరెండ్ డానియల్ అధ్యక్షతన నిర్వహించే ఈ వేడుకలకు గుంటూరు బైబిల్ మిషన్ ఏఓ రెవరెండ్ బందెల రాజు ముఖ్య ప్రసంగీకులుగా విచ్చేయనున్నారన్నారు. వేడుకల అనంతరం ప్రేమవిందు ఉంటుందన్నారు. వేడుకల్లో విశ్వాసులు పెద్దెత్తున పాల్గొని దేవుని అనుగ్రహం పొందాలన్నారు.

మందుబాబులకు అడ్డాగా కళాశాల


ప్రభుత్వ జూనియర్ కళాశాల

- చీకటి పడితే జూనియర్ కళాశాలలో పోకిరీల హల్‌చల్
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు


ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట తాగిపడేసిన గ్లాసులు, వృత్తంలో మద్యం బాటిళ్లు

తాడిపత్రిటౌన్: కళాశాలలో చదవాలంటే తాగి పారేసిన మందు గ్లాసులు ఎత్తాల్సి వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు. పట్టణంలోని జూనియర్ కళాశాలకు వాచ్‌మెన్‌తో పాటు ప్రహరీ లేకపోవడంతో పోకిరీలకు, మందుబాబులకు అడ్డాగా మారింది. దీంతో విద్యార్థులు ముఖ్యంగా బాలికలు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దాదాపు 400 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాలకుల ఉదాసీనత, కళాశాల సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా విద్యాలయానికి రక్షణ కరువైంది. కనీసం కళాశాలకు ఓ వైపు వున్న ప్రహరీ ప్రధాన గేట్లు కూడా మూయకుండా కళాశాల సిబ్బంది ఇళ్లకు వెళ్తుండటంతో మందుబాబులు కళాశాల ఆవరణను బార్‌గా మార్చారు. చీకటి పడితే చాలు మందుబాబులు కళాశాల ఆవరణలో మద్యం తాగుతున్నారు. తాగిన ప్లాస్టిక్ గ్లాసులు, సీసాలు, సిగరెట్ పీకలు అక్కడే వదిలేసి వెళ్తుండటంతో ఉదయం కళాశాలకు వచ్చిన విద్యార్థులు వాటిని తొలగించాల్సిన దుస్థితి నెలకొంది. అలాగే కళాశాల చుట్టూ ప్రహరీ లేకపోవడం వల్ల కూడా పోకిరీలు క్రీడా మైదానంలో యథేచ్ఛగా తిరుగుతున్నారు. దీంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కళాశాలకు రక్షణ కల్పించడంతో పాటు మందుబాబులను అరికట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కళాశాల ఆవరణలోనే తాగుతున్నారు



ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. రాత్రి పూట రోజు క్లాస్‌రూం ముందరే కొందరు ఆకతాయిలు మందు తాగుతున్నారు. ఉదయం వచ్చి వాటిని తొలగించి చదవుకోవాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు చర్యలు తీసుకొని మందుబాబుల బెడదను తొలగించాలి.

– కుళ్లాయప్ప, విద్యార్థి, జూనియర్ కళాశాల

వాచ్‌మెన్ లేదు.. ప్రహరీ లేదు..



ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాను. కళాశాలకు వాచ్‌మెన్ లేదు. ప్రహరీ లేదు. పశువులు, పోకిరీలు, మందుబాబులకు అడ్డాగా మారింది. నిత్యం పోకిరీలు, మందుబాబులు వచ్చి మందుతాగి గ్లాసులు, సీసాలు అక్కడే పడేసి వెళ్తున్నారు. ఉదయాన్నే వాటిని తీయాల్సి వస్తోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– ఆవులప్ప, విద్యార్థి, జూనియర్ కళాశాల

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..



జీతం తక్కువ కావడంతో కళాశాలలో వాచ్‌మెన్‌గా చేయడానికి ఎవ్వరూ రావడం లేదు. అలాగే కొన్ని కారణాల వల్ల ప్రహరీ నిర్మాణ మధ్యలోనే ఆగిపోయింది. నిత్యం పోకిరీలు, మందుబాబులు మద్యం సేవించి కళాశాల ఆవరణను అపరిశుభ్రం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా.. ఎలాంటి ఫలితం లేకపోయింది.

– విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్

భక్తిశ్రద్ధలతో అయ్యప్పస్వామి ఊరేగింపు


రథంపై కొలువుదీరిన అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహం

గుంతకల్లు: అయ్యప్ప స్వామి మండల పూజ సందర్భంగా మాలధారులు, భక్తులు స్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక డీఆర్ఎం కార్యాలయ సమీపంలోని అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం మండల పూజ సందర్భంగా స్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప భక్తమండలి, అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం పాత గుంతకల్లులోని శివాలయం నుంచి అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంపై కొలువుదీర్చి ఊరేగించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ భక్తిశ్రద్ధలతో ఊరేగింపు శోభాయమానంగా సాగింది.

ఘనంగా ఆరాధనోత్సవం


ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్

పామిడి: మండలంలోని అన్ని చర్చిలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ ప్రసంగించారు. పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు ఈ లోకానికి వచ్చారన్నారు. క్రీస్తును మన హృదయంలో పదిలపరచుకోవడమే నిజమైన క్రిస్మస్ ఆనందమన్నారు. క్రీస్తుకు మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ఫలప్రదమవుతాయన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు


ఆవులాంపల్లిలో మాట్లాడుతున్న పోలీసులు

పెద్దవడుగూరు: గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా వదిలే ప్రసక్తి లేదని ఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని ఆవులాంపల్లి, విరుపాపురం గ్రామంలో ఆదివారం ఎస్ఐ తన సిబ్బందితో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమానితులు కనపడినా , గొడవలకు పాల్పడినా ఉపేక్షించేది లేదన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా తమ దృష్టికి తీసుకరావాలని సూచించారు. బాధితులు ఎవరైనా పోలీసులకు సమస్యలు తెలియజేయవచ్చని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. పేకాట, మట్కా లాంటి అసాంఘిక కార్యాకలాపాలకు నిర్వహిస్తున్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. పొలాల్లో మోటార్ పంపు సెట్లు, వైర్లు దొంగలించే వారిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరికైనా అనుమానం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు.

15లోపు బీమా ప్రీమియం చెల్లించండి

గుత్తి రూరల్: ఆర్థిక మంత్రిత్వ శాఖ అనుబంధ సంస్థ అగ్రికల్చర్ ఇన్సూరెన్సు కంపెనీ రబీ సీజన్‌లో మామిడి పంటకు వాతావరణ ఆధారిత బీమా సౌకర్యం కల్పిస్తోందని, రైతులు ఈ నెల 15లోపు ప్రీమియం చెల్లించాలని గుత్తి ఉద్యానవనశాఖ అధికారిణి మిత్రవింద మాధవి సూచించారు. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ అక్టోబర్ 1నుంచి డిసెంబర్ 15 వరకూ టమాట సాగు చేసే రైతులు బీమా ప్రీమియం ఎకరాకు రూ.1.600 చెల్లిస్తే పంటనష్ట పరిహారం రూ.32 వేలు పొందవచ్చన్నారు. ఐదేళ్లు దాటిన మామిడి చెట్లు ఉన్న రైతులు ఎకరాకు రూ.1.650 ప్రీమియం చెల్లిస్తే రూ.33 వేల వరకూ పంట నష్ట పరిహారం పొందవచ్చన్నారు. బీమా కోసం పేర్లు నమోదు చేసుకోవడానికి రైతు ఆధార్ కార్డు, బ్యాంకు పాసు పుస్తకం, పట్టాదారు పాసు పుస్తకం, పంట వేసినట్టు రైతు సేవా కేంద్రంలో వీఏఏ, వీహెచ్ఏలు ఇచ్చిన పంట నిర్ధారణ పత్రం అందించాల్సి ఉంటుందన్నారు. ప్రీమియం చెల్లించిన రైతులు రసీదు తీసుకొని రైతు సేవా కేంద్రాల్లో వీఏఏ లేదా వీహెచ్ఏలకు అందజేసి బీమా చేసినట్టు పేర్లు నమోదు చేసుకోవాలని హెచ్ఓ సూచించారు.

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ మార్పు

పుట్లూరు: మండలంలో రెవెన్యూ సదస్సుల షెడ్యూల్ మార్పు చేసినట్లు తహసీల్దార్ శేషారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తేదీ గాండ్లపాడు, 11న శనగలగూడూరు, 17న పుట్లూరు, 18న చాలవేముల, 19న కుమ్మనమల, 20 చెర్లోపల్లి, 21, ఎల్లుట్ల, 27న కడవకల్లు, 28న సూరేపల్లి, జనవరి 2న దోశలేడు, 3న చింతకుంట, 4న కందికాపుల, 7న మడుగుపల్లి, 8న చిన్నమల్లేపల్లి, 9న కోమటికుంట్ల, 10న గరుగుచింతలపల్లిలో సదస్సులు నిర్వహిస్తామన్నారు.

యాడికి: మండలంలో రెవెన్యూ గ్రామ సభల్లో స్వల్ప మార్పులు చేశామని తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 10న నగరూరు, 13న చందన, 17న యాడికి, 19న కమలపాడు, 20న వేములపాడు, 24న కమలపాడు, 26న కుందనకోట, 28న రాయలచెరువు, జనవరి 2న ఓబుళాపురం, 4న పుప్పాల, 7న తిమ్మాపురం, 8న తూట్రాళ్లపల్లిలో సభలు నిర్వహిస్తామన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం


అనంత గజగరుడ లక్ష్మీనారాయణస్వామి కల్యాణోత్సవ దృశ్యం

పామిడి: పట్టణంలోని తగ్గుదేవాలయంలో ఆదివారం రాత్రి అనంత గజగరుడ లక్ష్మీనారాయణ స్వామి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకుడు విశ్వనాథశర్మ వేద మంత్రోచ్చరణల నడుమ దంపతులు హరీష్‌కుమార్–సింధూజ, సినాకపాణి నాగప్రణతి సారథ్యంలో శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీనారాయణస్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవాన్ని వైభవంగా చేశారు. మంగళహారతి అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఏటా మార్గశిర మాసం మొదటి ఆదివారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక


గార్లదిన్నె: ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అనంతపురం డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఏఈ మాట్లాడుతూ అనంతపురంలోని ఎస్ఈ కార్యాలయంలో ప్రత్యేక విద్యుత్ అవగాహన సదస్సు నిర్వహిస్తారన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో గృహ అవసరాలకు, వ్యవసాయానికి విద్యుత్ వినియోగిస్తున్న రైతులు ఏమైనా సమస్యలు ఉంటే విద్యుత్ పరిష్కార వేదికలో అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలన్నారు.

వ్యక్తి మృతి


మృతి చెందిన గ్యాస్ గోపాల్

గుత్తి: పట్టణంలోని చెంబుల బావి వీధికి చెందిన గ్యాస్ గోపాల్ (53) అనే వ్యక్తి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గత గురువారం గ్యాస్ గోపాల్ కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే అనంతపురం ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. అతడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ఒకరికి గాయాలు


గాయపడిన రామ్మోహన్

పెద్దవడుగూరు: మండల కేంద్రం సమీపంలో ద్విచక్ర వాహనం బోల్తా పడి చింతలచెరువు గ్రామానికి చెందిన రామ్మోహన్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు.. పెద్దవడుగూరు నుంచి అతడు చింతలచెరువు గ్రామానికి ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మతిస్థిమితం లేని వ్యక్తికి తగలడంతో ఇద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. గాయపడిన మతిస్థిమితం లేని వ్యక్తిని 108 వాహనంలో పామిడికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

- తెగుళ్లపై అప్రమత్తత ఎంతో అవసరం
- మొక్కజొన్న రైతులకు శాస్త్రవేత్త మల్లీశ్వరి సూచన




కొట్టాలపల్లి సమీపంలో సాగు చేసిన మొక్కజొన్న పంట

బుక్కరాయసముద్రం: రైతులు వేరుశనగ, వరి పంటకు ప్రత్యామ్నాయ పంటగా తక్కువ పెట్టుబడితో మొక్కజొన్న సాగు ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, కోఆర్డినేటర్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మల్లీశ్వరి సూచించారు. మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యం, కత్తెర పురుగు నివారణపై ఆమె 'సాక్షి'కి వివరించారు. రైతులకు ప్రత్యామ్నాయంగా మొక్క జొన్న పంట మంచి లాభదాయకంగా ఉంటుందన్నారు. నీటి వనరులు తక్కువున్నా...తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలో మొక్కజొన్న పంటను చేతికి తీసుకోవచ్చన్నారు. నవంబర్–డిసెంబర్ నెలలో మొక్కజొన్న పంట సాగు చేయవచ్చన్నారు.

నాణ్యమైన విత్తనాలనే ఎన్నుకోవాలి

మొక్క జొన్న సాగులో మంచి రకాల విత్తనాలను రైతులు ఎంచుకోవాలి. వీటిలో డిహెచ్ఎం–111, బీహెచ్ఎం–1576 డిహెచ్ఎం–113, బీహెచ్–1620, రకాలు ఎంతో అనువైనవి. వీటితో పాటు హైబ్రిడ్‌లో అడ్వాట–741, 751, డెకాల్బ్–9144, 9178, ఈ రకాల విత్తనం అధిక దిగుబడిని ఇచ్చే మధ్యకాలిక రకం. ఎండు ఆకు, కాండం కుళ్లు, కంకి ఎండు తెగులు తట్టుకుంటుంది. కోత సమయంలో కర్ర పచ్చిగా ఉండి మేలైన పశుగ్రాసంగా పనికి వస్తుంది. ఈ రకాలు స్వల్పకాలిక హైబ్రిడ్. ఈ పంట సాగుకు నీరు ఇంకే నల్లరేగడి, ఎర్రనేలలు, ఎంతో అనుకూలం. నీరు ఇంకే నేలలు ఈ పంట సాగుకు పనికి రావు. రైతులు విత్తే సమయంలో తప్పకుండా విత్తనశుద్ధి చేసుకోవాలి. కిలో విత్తనానికి 3 గ్రాములు మాంకోజెబ్ ఎం–45 లేదా కాప్టాన్ మందుతో విత్తనశుద్ధి చేసుకోవాలి.

కలుపు యాజమాన్య పద్ధతులు

పంట విత్తిన తరువాత 2, 3 రోజుల్లోపు అట్రజిన్ అనే కలుపు మందును ఎకరాకు 800 గ్రాములు 200 లీటర్ల నీటికి కలిపి తగినంత తేమ ఉన్నప్పుడు పిచికారీ చేయాలి. ఇలా చేయడం వ నెల పాటు కొన్ని గడ్డి జాతి మొక్కలను అదుపు చేయవచ్చు. విత్తిన 30–35 రోజులకు పశువులతో (దంతి, గొర్రు) ట్రాక్టర్‌తో అంతర కృషి చేస్తే కలుపు నివారించుకోవచ్చు.

ఎరువుల యాజమాన్యం


మొక్క జొన్న సాగు 30–35 రోజుల మధ్య ఉన్నప్పుడు ఎకరాకు 30 కేజీల నత్రజని, 50 కేజీల పొటాష్ వేసుకోవాలి. ఎకరాజు 20 కేజీల జింక్ సల్ఫేటు వేసుకోవాలి. మొక్కలు ఆకులు పసుపు పచ్చ రంగులోకి మారుతున్నట్లు కనిపిస్తే లీటరు నీటికి 2 గ్రాములు జింక్ సల్ఫేటు పిచికారీ చేయాలి. పొలాల్లో పైపాటి ఎరువులు వేసేటప్పుడు భూమిలో తగినంతగా తేమ ఉండాలి. మామూలుగా మొక్క జొన్న పంటకు పిచికారీ మందులు ఎక్కువగా ఉండవు. ఎరువులు కూడా తక్కువే వేసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు ఇలా..

మొక్కజొన్న పంట రబీలో సాగు చేసే సమయంలో గులాబీ రంగు కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. పిల్ల పురుగులు మొదట ఆకుల పత్ర హరితాన్ని గోకి తింటాయి. తర్వాత ముడుకుని ఉన్న ఆకు ద్వారా కాండంలోకి చేరతాయి. లార్వాలు ఎదిగే అంకురాన్ని తినడం వలన మువ్వ చనిపోయి ఎండిపోతుంది. వీటి నివారణకు రైతులు చర్యలు చేపట్టాలి. పొలంలో కలుపు మొక్కలు, చెత్తా చెదారం లేకుండా శుభ్రం చేసుకోవాలి. పురుగు ఆశించిన మొక్కలు పీకి దూరంగా తీసుకెళ్లి నాశనం చేయాలి. పొలం చుట్టూ 3–4 వరుసల జొన్నను ఎర పంటగా వేసి 40 రోజుల తరువాత తీసి వేయాలి. మొక్కజొన్నలో అంతర పంటగా కంది, సోయాబీన్, సాగు చేయడం వలన పురుగు ఉధృతి తగ్గిపోతుంది. మోనోక్రోటోఫాస్–36 ఎకరాకు 320 మిల్లీ లేదా క్లోరాంట్రినిలిప్రోల్ (కొరాజిన్, రైనాక్సిపర్) లాంటివి ఎకరాకు 60 మిల్లీ 200 లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఉధృతి ఎక్కువ ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోలు చొప్పున పైరు మొలక ఎత్తిన 25–30 రోజులకు ఆకుల సుడులలో వేసుకోవాలి. తద్వారా పురుగుల ఉధృతిని నివారించుకోవచ్చు.

యూటీఎఫ్ మండల కమిటీ ఎన్నిక


మహమ్మద్ గౌస్


పవన్‌కుమార్

బుక్కరాయసముద్రం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) మండల కమిటీని ఎన్నుకున్నట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూటీఎఫ్ మండల గౌరవ అధ్యక్షుడిగా హెన్రీమార్క్, మండలాధ్యక్షుడిగా మహమ్మద్ గౌస్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా శివప్రసాద్, అనూరాధ, కోశాధికారిగా బాబూరావు, కార్యదర్శులుగా దివాకర్‌రెడ్డి, పుల్లన్న, లక్ష్మి నారాయణ, వన్నప్ప, అరుణ, మేరి, ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తామన్నారు.

విద్యార్థిని అదృశ్యం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అదృశ్యమైంది. పెద్దపప్పూరు మండలం జూటూరుకు చెందిన బాలిక గత మూడు రోజులుగా కనిపించలేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల క్రితం గ్రామం నుంచి కళాశాలకు వచ్చిన విద్యార్థిని రాత్రి అయినా ఇంటికి రాక పోవడంతో బంధువుల ఇళ్ల వద్ద వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాలిక ఫోన్‌కు వచ్చిన కాల్స్ ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

'కోటంక'లో ప్రత్యేక పూజలు

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృత అభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు.

కల్లూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు


మాట్లాడుతున్న డీఏఓ ఉమామహేశ్వరమ్మ

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు మార్కెట్ యార్డులో వరి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు డీఏఓ ఉమామహేశ్వరమ్మ , ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. ఆదివారం మండలంలోని కల్లూరు మార్కెట్ యార్డులో రైతులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వరి క్వింటాల్ రూ.2300తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తేమ శాతం 17లోపు ఉండాలన్నారు. రైతులు వరి ధాన్యం ఆరబెట్టి కొనుగోలు కేంద్రానికి తరలించాలన్నారు. రైతులకు రావాల్సిన డబ్బులు 48 గంటల్లో బ్యాంకు ఖాతాల్లో జామ చేస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఈరమ్మ, ఏఓ సోమశేఖర్, రైతులు పాల్గొన్నారు.